సాక్షి
విశాఖపట్నం

ఆదివారం । 26 । ఫిబ్రవరి । 2023



రిప్ కరెంట్ సిగ్నల్ వ్యవస్థ
రుషికొండ తీరంలో రిప్ కరెంట్ ఉధృతిని తెలుపుతూ హెచ్చరించే వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. 8లో



చిత్ర కళా వైభవం
బీచ్‌రోడ్డులోని ఓ హోటల్‌లో నిర్వహించిన 'ది ఆర్ట్ వర్క్స్' ఎగ్జిబిషన్ సందర్శకులను విశేషంగా అలరించింది. 10లో



ఆర్మీలో కొలువుల జాతర
దేశ చరిత్రలో తొలిసారిగా నూతన విధానం ద్వారా ఆర్మీ రిక్రూట్‌మెంట్ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. 10లో

న్యూస్‌రీల్

విమ్స్‌లో భోజనం సరఫరాకు టెండర్

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో ఇన్‌పేషెంట్లకు, డ్యూటీ డాక్టర్లకు భోజనం సరఫరా చేయడానికి టెండర్లు ఆహ్వానిస్తున్నామని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ కలిగిన ఏజెన్సీలు మార్చి 3వ తేదీలోపు విమ్స్‌లోని కార్యాలయంలో టెండర్లు అందజేయాలని సూచించారు. టెండర్ కోసం రూ.2లక్షలు డిపాజిట్ చేయాలని తెలిపారు. వివరాల కోసం www.vimsvskp.com వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించారు.

జిల్లా జట్టుకు కార్తికేయ, సాత్విక

విశాఖ స్పోర్ట్స్: జిల్లా అండర్-9 చదరంగం జట్టు ఎంపిక పోటీల్లో కార్తికేయ, సాత్విక సత్తా చాటారు. ఆల్ విశాఖ చెస్ సంఘం ఆధ్వర్యంలో పీవీకే మేన్షన్ హాల్‌లో శనివారం ఈ పోటీలు జరిగాయి. బాలురకు ఐదు రౌండ్లు, బాలికలకు నాలుగు రౌండ్లు జరగ్గా 32 మంది పోటీపడ్డారు. బాలురలో అద్దంకి కార్తికేయ ఐదు పాయింట్లతో, కోనాడ జయంత్ నాలుగు పాయింట్లతో నిలవగా.. బాలికల్లో పాట్నూరు సాత్విక నాలుగు పాయింట్లతో, బట్ట కమలప్రియ మూడు పాయింట్లతో నిలిచారు. ఆయా విభాగాల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన వీరంతా జిల్లా అండర్-9 జట్టుగా స్టేట్ అంతర్ జిల్లాల టోర్నీలో పాల్గొనున్నారు.

పీజీ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలు

నేడు దసపల్లాలో ఇంటర్వ్యూలు

డాబాగార్డెన్స్: వివిధ పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్(ఐపీఈ) డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాసమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లమో ఇన్ మేనేజ్‌మెంట్, పీజీడీఎం-బ్యాంకింగ్, ఫైనాన్సియల్ సర్వీసెస్, పీజీడీఎం-ఇంటర్నేషనల్ బిజినెస్, పీజీడీఎం-హ్యూమన్ రీసోర్సెస్ మేనేజ్‌మెంట్ తదితర పీజీ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 26న నగరంలోని హోటల్ దసపల్లాలో గ్రూప్ డిస్కషన్, వ్యక్తిగత ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల మేనేజ్‌మెంట్ విద్యార్థులు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ వెబ్‌సైట్ www.ipeindia.org, ఫోన్ నంబర్ 93919 32129లో సంప్రదించవచ్చు.

ఐదు హాళ్లు.. 126 స్టాళ్లు

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు చురుగ్గా ఏర్పాట్లు



ఏయూ మైదానంలో జీఐఎస్ సదస్సుకు చురుగ్గా సాగుతున్న ఏర్పాట్లు

సాక్షి, విశాఖపట్నం: ప్రతిష్టాత్మక సదస్సులకు విశాఖ సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాల్ని ప్రపంచానికి సమగ్రంగా వివరించేలా గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్(జీఐఎస్), ప్రపంచ దేశాల శిఖరాగ్ర సదస్సుగా జీ-20 సమ్మిట్ మార్చిలో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ ప్రతినిధులు ఆకర్షితులయ్యేలా విశ్వ నగరాన్ని తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో.. జిల్లా యంత్రాంగం సమష్టిగా మౌలిక సదుపాయాల అభివృద్ధి, సుందరీకరణ పనుల్లో నిమగ్నమైంది. ఏయూ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరిగే జీఐఎస్ సదస్సు కోసం అధికార యంత్రాంగం పూర్తి స్థాయి ప్రణాళికలతో సిద్ధమైంది.

విశాఖ కేంద్రంగా మార్చి 3, 4 తేదీల్లో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు, 28, 29 తేదీల్లో జీ-20 సన్నాహక సదస్సు జరగనున్నాయి. ఈ సదస్సులకు ప్రపంచ దేశాల ప్రతినిధులు నగరానికి రానున్న నేపథ్యంలో విశాఖను అద్భుతంగా తీర్చిదిద్దే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. కలెక్టర్ మల్లికార్జున మార్గదర్శకంలో 15 శాఖల ఆధ్వర్యంలో రహదారులతో పాటు ఇతర ముఖ్యమైన రోడ్ల అభివృద్ధి, పర్యాటక ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దడం, నగరమంతా దేదీప్యమానంగా విద్యుత్ వెలుగులతో దర్శనమిచ్చే పనులు కొనసాగుతున్నాయి. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు దేశ విదేశీ పెట్టుబడిదారులు హాజరయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జర్మన్ హ్యాంగర్స్‌తో మొత్తం ఐదు హాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఏఏ హాలులో ఏఏ విభాగాలను ఏఏ అధికారులు పర్యవేక్షించాలి.. ఏ హాలులో ఏఏ ఏర్పాట్లు చేయాలనే అంశాలపై ఇప్పటికే పని విభజన చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఏర్పాట్లు ఇలా...

హాల్-1: ఈ హాలులో 700 మంది ప్రతినిధులకు భోజన సౌకర్యం కల్పిస్తారు.

హాల్-2: ఈ హాలులో థీమ్ పెవిలియన్ ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో కేటగిరీల వారీగా 126 స్టాళ్లు ఉంటాయి.

కేటగిరీ	కేటాయించిన స్టాళ్లు
స్టార్టప్ జోన్	15
కంట్రీ ఎరీనా	10
పునరుత్పాదక ఇంధన వనరుల విభాగం	10
హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్	08
టూరిజం	05
ఆటో అండ్ ఏరో స్పేస్	10
ఐటీ అండ్ ఎలక్ట్రానిక్స్	10
ఫార్మా అండ్ హెల్త్‌కేర్	08
ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ లాజిస్టిక్స్	08
అగ్రికల్చర్ అండ్ ఫుడ్ ప్రాసెసింగ్	08
కెమికల్స్, పెట్రోలియం, అల్లాయిడ్	08
మేరీటైమ్ ఇన్‌ఫ్రా అండ్ పోర్ట్ లెడ్ ఇండస్ట్రీస్	06
ఇండస్ట్రీస్, ఎంఎస్ఎంఈ అండ్ అల్లాయిడ్ కార్పొరేషన్లు	04
ఏపీఐఐసీ	02
సచివాలయాలు, పాఠశాల విద్య, హెల్త్, అగ్రికల్చర్ డెయిరీ, పశుసంవర్ధక, ఎంఏయూడీ మొదలైన శాఖలు	14

హాల్-3: మెయిన్ కాన్ఫరెన్స్ హాలు ఇది. దీనిని వేదిక, గ్రీన్ రూమ్స్, హోల్డింగ్ ఏరియాలుగా విభజించారు. 50 మంది కూర్చొనేలా స్టేజ్ చైర్ సీటింగ్, 50 మందికి సరిపడా సోఫా సిటింగ్, 1976 మందికి చైర్ సీటింగ్, 60 మంది మీడియా ప్రతినిధుల కోసం ప్రెస్ సీటింగ్ ఏర్పాటు చేస్తున్నారు.

హాల్-4: జీఐఎస్ సదస్సుకు కీలకమైన హాల్ ఇది. ముఖ్యుల కోసం గదులు, కీలక సమావేశాలకు లాంజ్‌లు ఇక్కడే ఉండనున్నాయి. ముఖ్యమంత్రి రూమ్, సీఎం మీటింగ్ హాలు, సీఎం బోర్డ్ రూమ్, పరిశ్రమల శాఖ, ఆర్థిక శాఖ మంత్రులకు గదులు, చీఫ్ సెక్రటరీ రూమ్, ప్రభుత్వ లాంజ్, పరిశ్రమల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, సీఎం స్పెషల్ చీఫ్ సెక్రటరీ, పీఎంయూ టీమ్ లాంజ్‌తో పాటు రెండు వీఐపీ లాంజ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు 132 మంది సామర్థ్యంతో వీఐపీ డైనింగ్ హాల్, 152 మంది సామర్థ్యంతో మీడియా బ్రీఫింగ్ హాల్, 74 మంది మీడియా ప్రతినిధులు కూర్చునేలా మీడియా రూమ్, 120 మంది సామర్థ్యంతో మీడియా లంచ్ హాల్ ఏర్పాటు చేస్తున్నారు.

హాల్-5: ఒక్కో హాల్‌లో 390 మంది సామర్థ్యంతో రెండు సెమినార్ హాళ్లు, 10 బిజినెస్ టూ బిజినెస్(బీటూబీ) హాళ్లు, 34 లాంజ్ స్పీకర్ హాళ్లు, సర్వీస్ గదులు ఇందులో ఉండనున్నాయి.

ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు కేంద్రంలో పక్కా ఏర్పాట్లు

సీతంపేట: వచ్చే నెల 16న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రంలో పక్కాగా ఏర్పాట్లు చేయాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు సిద్ధార్థ్ జైన్ అధికారులను ఆదేశించారు. స్వర్ణభారతి స్టేడియంలో స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. రిసెప్షన్ కౌంటర్లు పరిశీలించారు. ఓట్ల లెక్కింపు సమయంలో చేపడుతున్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, సీతమ్మధార తహసీల్దార్ శ్యామ్ ప్రసాద్, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో సమీక్ష

ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు సిద్ధార్థ్ జైన్ కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నిక ఏర్పాట్లపై కలెక్టర్ మల్లికార్జున, ఈఆర్వో, ఏఈఆర్వో, నోడల్ అధికారులతో చర్చించారు.



స్వర్ణభారతి స్టేడియంలో స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు సిద్ధార్థ్ జైన్

ట్యూనా.. హంగామా

- ఈ సీజనులో ఆశాజనకంగా లభ్యం
- బంగ్లాదేశ్ వరకు డీప్ సీలో వేట
- హార్బర్‌కు రోజుకు 60 టన్నుల రాక
- టన్ను రూ.2 లక్షలు పలుకుతున్న ధర
- కేరళ సహా విదేశాలకు ఎగుమతి



ఫిషింగ్ హార్బర్‌లో ట్యూనా చేపలు

సాక్షి, విశాఖపట్నం: కాసులు కురిపించే ట్యూనా (సూర) చేపలు బోటు యజమానుల్లో ఆనందాన్ని నింపుతున్నాయి. కొన్నాళ్ల నుంచి ఇవి సముద్రంలో విరివిగా లభ్యమవుతున్నాయి. ఏడాది పొడవునా వీటి లభ్యత ఉన్నా డిసెంబర్ నుంచి ఏప్రిల్ వరకు ట్యూనాలకు సీజన్. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో మరింతగా ఇవి దొరుకుతాయి. మరబోట్లు వలలు వేసి చేపల వేట సాగిస్తారు. కానీ ట్యూనాల కోసం వలలతో కాకుండా గాలం (హుక్)లతో వేటాడతారు. లోతైన సముద్ర ప్రాంతం (డీప్ సీ) ఉన్న చోట ట్యూనాలు ఎక్కువగా ఉంటాయి. అందువల్ల సముద్రతీర ప్రాంతానికి దూరంగా ఉండే లోతు ప్రదేశానికి వీటి కోసం మరబోట్లలో వెళ్తుంటారు. విశాఖ హార్బర్ నుంచి అలా సముద్రం లోతు ఎక్కువగా ఉండే బంగ్లాదేశ్ వరకు ట్యూనాల వేటకు వెళ్తారు. మామూలు చేపలవేటకు వారం పది రోజుల అవసరమైతే.. ట్యూనాల వేటకు 25 రోజుల నుంచి నెల వరకు సమయం తీసుకుంటుంది.

ట్యూనాల కోసం ప్రత్యేక బోట్లు

విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో 700కు పైగా మరబోట్లున్నాయి. వీటిలో 400 వరకు బోట్లు వలలతో చేపలవేట సాగిస్తుంటాయి. మరో 300కు పైగా ట్యూనా చేపల వేట కోసం ప్రత్యేకంగా తయారు చేయించినవి ఉంటాయి. ఈ బోట్లలో 10-12 కిలోమీటర్ల దూరం తాడుకు 600-700 వరకు గాలాలు అమర్చి సముద్రంలో వదిలిపెడ్తారు. ఏడెనిమిది గంటల తర్వాత గాలాలను పరిశీలించుకుంటూ వెళ్తారు. హుక్‌లకు తగిలిన ట్యూనాలను తీసి బోటులో వేస్తారు. ఇలా గాలాలు వేసిన ఒక్కో ప్రాంతంలో ఒకరోజు కంటే ఎక్కువ సమయం తీసుకుంటుంది. ఒకసారి వేటకు వెళ్తే ఐదు నుంచి 10 టన్నుల వరకు ట్యూనాలు పట్టుబడతాయి. వీటిలో ఐదు నుంచి 80 కిలోల బరువున్నవి ఉంటాయి. కొన్నాళ్లుగా ఇవి రోజుకు 60 టన్నులకు పైగా ట్యూనాలతో హార్బర్‌కు వస్తున్నాయి.

టన్ను ట్యూనాల ధర రూ.2 లక్షలు

టన్ను ట్యూనా చేపల ధర రూ.2 లక్షలు పలుకుతోంది. చిన్న ట్యూనాలైతే రూ.లక్ష నుంచి లక్షన్నర వరకు కొనుగోలు చేస్తున్నారు. బోటు యజమానుల నుంచి వర్తకులు ఈ ట్యూనాలను కొనుగోలు చేసి కేరళతో పాటు యూరోపియన్ దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. కేరళలో ట్యూనాలను అమితంగా ఇష్టపడతారు. అందువల్ల ఆ రాష్ట్రంలో వీటికి డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. యూరోపియన్ దేశాల్లో ట్యూనా చేపలను లొట్టలేసుకుని తింటారు. ఈ ట్యూనాల్లో నామాల సూర (స్కిప్ జాక్), కన్ను సూర, రెక్క సూర (ఎల్లో కిన్) వంటివి ఉంటాయి. వీటిలో కన్ను, రెక్క సూరలకంటే నామాల సూరల రేటు తక్కువగా ఉంటుంది.

కోనాంలు కూడా..

కొన్నాళ్లుగా ట్యూనాలతో పాటు కొమ్ము కోనాం, బాతు కోనాం తదితర రకాల భారీ చేపలు లభ్యమవుతున్నాయి. ఈ రకాల చేపలు కూడా పెద్ద సైజులో ఉంటాయి. ఇవి కిలో రూ.100 ధర పలుకుతోంది. ట్యూనాలకంటే ఈ కోనాం చేపలు కూడా లభించడం వల్ల బోటు యజమానులకు ఒకింత లాభదాయకంగా ఉంటోందని, లేనిపక్షంలో నష్టాలను భరించాల్సి వస్తుందని ట్యూనా వేట సాగించే బోటు యజమాని కాకి నాని 'సాక్షి'తో చెప్పారు.

ఎలియన్స్ క్లబ్ ప్రగతికి సహకరించండి

ఆరిలోవ: అసోసియేషన్ ఆఫ్ ఎలియన్స్ క్లబ్ ప్రగతికి సభ్యులంతా సహకరించాలని క్లబ్ అధ్యక్షుడు వి.ఎం.రావు పిలుపునిచ్చారు. సిరిపురం వద్ద వుడా చిల్డ్రన్ ఎరీనాలో శనివారం అసోసియేషన్ ఆఫ్ ఎలియన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఎలియన్స్ పూర్వ అధ్యక్షుడు బి.తిరుపతిరాజు మాట్లాడుతూ విశాఖలో నిర్వహించిన ఈ సదస్సుకు వివిధ దేశాల నుంచి సభ్యులు హాజరవడం సంతోషకరమన్నారు. సదస్సులో ఎలియన్స్ అంతర్జాతీయ స్థాయి సభ్యులు టి.పి గాంధీ, డాక్టర్ పి.శాంతమ్మ, అనూప్ మిట్టల్, కులదీప్ సింగ్, కె.రంగారావు, పంకజ్ శ్రీవాత్సవ్, మాతివన్, ఆర్కే సాక్సన్, కె.గాంధీ పాల్గొన్నారు.

సరకు రవాణా పెంపునకు కృషి

- కేంద్ర పోర్టులు, షిప్పింగ్ శాఖ సెక్రటరీ పంత్
- పోర్టు అధికారులతో సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న కేంద్ర పోర్టులు, షిప్పింగ్ శాఖ సెక్రటరీ సుధాన్ష్ పంత్

సాక్షి, విశాఖపట్నం: ప్రైవేట్ పోర్టులతో పోటీ పెరుగుతున్న తరుణంలో సరకు రవాణా పెంపునకు వినూత్న ప్రణాళికలు అమలు చేయాలని కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలవనరుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి సుదాన్ష్ పంత్ ఆదేశించారు. శనివారం ఉదయం విశాఖ చేరుకున్న పంత్‌కు పోర్టు సీఐఎస్ఎఫ్ యూనిట్ గాడ్ ఆఫ్ ఆనర్ ఇచ్చింది. అనంతరం పోర్టుకు వచ్చిన పంత్‌కు విశాఖపట్నం పోర్టు అథారిటీ చైర్మన్ కె.రామ్మోహన్‌రావు స్వాగతం పలికారు. పోర్టులో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను కేంద్ర కార్యదర్శి పరిశీలించారు. పోర్టు కార్యకలాపాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చైర్మన్ వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్షలో పంత్ మాట్లాడుతూ వీపీఏ అమలు చేస్తున్న భవిష్యత్తు కార్యాచరణపై సంతృప్తి వ్యక్తం చేశారు. పీపీపీ బెర్తుల కార్యకలాపాలు, సరకు రవాణా, ఆర్థిక స్థితి, అవుటర్ హార్బర్ 1,2 బెర్త్‌ల సామర్థ్యం పెంపు, క్రూయిజ్ టెర్మినల్ నిర్మాణం, బెర్తుల యాంత్రీకరణ, ఫ్లైఓవర్ల నిర్మాణ పనులు, ట్రక్ పార్కింగ్ టెర్మినల్, ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ తదితర పనులను నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని సూచించారు. సవాళ్లను ఎదుర్కొని పోర్టును అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు సాంకేతికతను అమలు చేయాలని ఆదేశించారు. పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే, కార్యదర్శి టి.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అలెప్పీ-ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: చెన్నై డివిజన్, బేసిన్ బ్రిడ్జి-వ్యాసరపడి సెక్షన్‌ల మధ్య జరుగుతున్న పనుల కారణంగా ట్రాఫిక్, పవర్ బ్లాక్ తీసుకుంటున్నందున ధన్‌బాద్-అలెప్పీ-ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్‌ను ఆయా తేదీలలో దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. ధన్‌బాద్‌లో సోమవారం బయలుదేరే ధన్‌బాద్-అలెప్పీ(13351) ఎక్స్‌ప్రెస్, తిరుగుప్రయాణంలో మార్చి 2న అలెప్పీలో బయలుదేరే అలెప్పీ-ధన్‌బాద్ (13352) ఎక్స్‌ప్రెస్‌లు వయా కొరుక్కుపేట, వ్యాసర్‌పడి, పెరంబూర్ మీదుగా రాకపోకలు సాగిస్తాయి. ఈ రైళ్లు ఆయా రోజుల్లో ఎంజీఆర్ సెంట్రల్ మీదుగా ప్రయాణించవు. దీనికి బదులుగా ప్రయాణికుల సౌకర్యార్థం పెరంబూర్‌లో అదనపు స్టాపేజీ కల్పించారు.

రుషికొండలో రిప్ కరెంట్ తెలిపే సిగ్నల్స్ వ్యవస్థ

కొమ్మాది: రుషికొండ తీరంలో ప్రమాదాల నివారణకు ఇస్రో, ఏయూ సహకారంతో రిప్ కరెంట్ ఉధృతిని తెలుపుతూ హెచ్చరించే వ్యవస్థను రాష్ట్ర పర్యాటక శాఖ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇక్కడ మెరైన్ వాచ్ టవర్ వద్ద ఈ సిగ్నల్ సిస్టంను ఏర్పాటు చేశారు. సెన్సార్ ద్వారా సముద్ర ఉనికి, అలల ఉధృతి, ప్రమాదస్థాయిని గుర్తించి.. గ్రీన్, ఆరెంజ్, రెడ్ రంగుల లైట్లతో సంకేతాలను అందించి పర్యాటకులను అప్రమత్తం చేస్తుంది. సముద్రం ప్రశాంతంగా ఉంటే గ్రీన్ లైట్, సముద్ర వాతావరణం ప్రమాదకర స్థాయి మధ్యస్థంగా ఉందని సూచిస్తూ ఆరెంజ్ లైట్, ప్రమాదస్థాయి తీవ్రంగా ఉన్నప్పుడు రెడ్ లైట్ వెలుగుతుంది. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న మెరైన్ పోలీసులు, లైఫ్ గార్డ్స్ ఈ సిగ్నల్స్ ద్వారా ఎప్పటికప్పుడు పర్యాటకులను అప్రమత్తంగా చేస్తారు. దీని వల్ల ప్రమాదాలు జరగకుండా నివారించే అవకాశం ఉంది. పర్యాటకులకు కూడా పూర్తిస్థాయిలో ఈ వ్యవస్థపై అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

రౌడీషీటర్ ఆత్మహత్య



శ్యామ్(ఫైల్)

మర్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధి తిక్కవానిపాలెం వాడపేటకు చెందిన రౌడీషీటర్ శ్యామ్(32) శనివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న 5వ పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కాగా.. అతనిపై 2012లో భార్యను చంపిన కేసు, 2018లోపై ఇంటి దొంగతనం కేసు, 2020లో బంధువుపై హత్యాయత్నం కేసులు నమోదయ్యాయి. 2022 డిసెంబర్‌లో గంజాయి కేసులో అరెస్ట్ అయిన శ్యామ్ జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. ఇటీవలే బెయిల్‌పై వచ్చిన శ్యామ్‌కు హత్యాయత్నం కేసులో కోర్టు నుంచి వారెంట్ రావడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. సీఐ విజయ్‌కుమార్ పర్యవేక్షణలో ఎస్.రవికిశోర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సండే క్లాసిఫైడ్స్ సాక్షి

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు చేసే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.